విశాఖపట్నం రైల్వే స్టేషన్‌లో

'రైల్ జన సంవాద్' కార్యక్రమం

- ప్రయాణికులతో ముఖాముఖి నిర్వహించిన డీఆర్ఎం లలిత్ బోహ్రా
- ప్రయాణికుల సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని అధికారులకు ఆదేశాలు





విశాఖపట్నం, అక్టోబర్ 24 (నేటి మనదేశమ్) : రైల్వే బోర్డు ఆదేశాల మేరకు విశాఖపట్నం డివిజన్ డివిజనల్ రైల్వే మేనేజర్ (డీఆర్ఎం) లలిత్ బోహ్రా గురువారం విశాఖపట్నం రైల్వే స్టేషన్‌లో 'రైల్ జన సంవాద్' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్య క్రమం ద్వారా స్టేషన్‌లో, రైళ్లలో ప్రయాణికులకు అందుబాటులో ఉన్న సౌకర్యాలను సమీక్షించి, ప్రయాణికుల నుంచి నేరుగా అభిప్రాయాలు, సూచనలు స్వీకరించారు. ఈ సందర్భంగా డీఆర్ఎం రైల్వే స్టేషన్‌లోని ప్రయాణికుల సౌకర్యాలను, రైళ్లలో అందుబాటులో ఉన్న వసతులను పరిశీలించారు. రైళ్లలో, స్టేషన్‌లోని వెయిటింగ్ హాళ్లలో ప్రయాణికులతో ముఖాముఖి మాట్లాడి, వారి సమస్యలు, సూచనలు, రైల్వే సేవలపై అభి ప్రాయాలను తెలుసుకున్నారు. ప్రయాణికుల నుంచి అందిన అభిప్రాయాలు, సమస్యలను స్వల్పకాలిక, మధ్యకాలిక, దీర్ఘకాలిక సమస్యలుగా వర్గీకరించారు. స్వల్పకాలిక, మధ్యకాలిక సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని సంబంధిత క్షేత్రస్థాయి అధికారులను డీఆర్ఎం ఆదే శించారు. దీర్ఘకాలిక సమస్యలను పరిశీలించి, తగిన ప్రణాళికతో పరిష్కార చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రయాణికుల అభిప్రాయాలకు ప్రాధా న్యతనిస్తూ, మెరుగైన ప్రయాణికుల సౌకర్యాలు కల్పించడం, సేవల నాణ్యతను పెంపొందించడం, ఫిర్యాదుల పరిష్కారంలో వేగవంతమైన చర్యలు తీసుకోవడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యం. ఈ కార్యక్రమంలో సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ శ్రీ కె. పవన్ కుమార్, సీనియర్ డివిజనల్ మెకానికల్ ఇంజినీర్ (కోచింగ్) ఆనంద్ కుమార్ ఎం., సీనియర్ డివిజనల్ ఇంజినీర్ (హెచ్‌క్యూ) డి.జగదీశ్వరరావు, డివిజనల్ మెకానికల్ ఇంజినీర్ (ఎన్‌హెచ్ఎం) గౌరవ్ తదితర అధికారులు పాల్గొన్నారు. విశాఖపట్నం డివిజన్ పరిధిలోని మొత్తం 40 రైల్వే స్టేషన్లలో సంబంధిత అధికారులు, పర్యవేక్షకుల ఆధ్వర్యంలో 'రైల్ జన సంవాద్' కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహిం చారు. ప్రయాణికుల సమస్యలను నేరుగా తెలుసుకుని, వాటి పరి ష్కారానికి చర్యలు చేపట్టడం ద్వారా ప్రయాణికుల సంక్షేమానికి, రైల్వే సేవల నిరంతర అభివృద్ధికి భారతీయ రైల్వే కట్టుబడి ఉందని ఈ కార్యక్రమం చాటిచెప్పింది.

ఆహ్లాదకర వాతావరణంలో

పిల్లలకు మధ్యాహ్న భోజనం

- మాధవధార జీవీఎంసీ హైస్కూల్ సందర్శనలో జిల్లా కలెక్టర్ ఎం.అభిషిక్త్ కిశోర్






విశాఖపట్నం, అక్టోబర్ 24 (నేటి మనదేశమ్) : విశాఖపట్నం, అక్టోబర్ 22: పాఠశాలల్లో విద్యార్థులకు ఆరోగ్యకరమైన, ఆహ్లాద కరమైన వాతావరణంలో మధ్యాహ్న భోజనం అందించాలని జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్ అధికారులను ఆదేశించారు. గురు వారం మాధవధార జీవీఎంసీ మున్సిపల్ హైస్కూల్‌ను సందర్శిం చిన ఆయన, విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనం నాణ్యతను పరిశీలించారు. విద్యార్థులు పరిశుభ్రమైన, సౌకర్యవంతమైన వాతావరణంలో భోజనం చేసేలా అవసరమైన కనీస మౌలిక వసతులు కల్పించాలని సూచించారు. విద్యార్థుల ఆరోగ్యం, పరిశుభ్రతకు ప్రాధాన్యత నిస్తూ మధ్యాహ్న భోజన పథకాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని, భోజనం నాణ్యత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం వహించరాదని స్పష్టం చేశారు. చేతులు కడుక్కునేందుకు ప్రత్యేక వాస్ బేసిన్ పెట్టాలని చెప్పారు. సందర్శనలో భాగంగా విద్యార్థులతో మమేకమై, వారితో కలిసి భోజనం చేశారు. వివిధ విషయాలపై విద్యార్థులతో మాట్లాడారు. విద్యా బోధన, ఇతర వసతుల కల్పనపై ఆరా తీశారు. డీఈవో ఎన్. ప్రేమ్ కుమార్, ఎంఈవో వేణుగోపాల్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

జనరల్ మేనేజర్ సందీప్ మాథూర్

సమగ్ర భద్రతా సమీక్షా సమావేశం నిర్వహణ

- నలుగురు ఉద్యోగులకు భద్రతా పురస్కారాలతో సత్కారం






విశాఖపట్నం, అక్టోబర్ 24 (నేటి మనదేశమ్) : జోన్ అంతటా రద్ది నిర్వహణ కార్యాచరణ విధానాలను అంచనా వేయడానికి మరియు మరింత మెరుగుపరచడానికి జనరల్ మేనేజర్ సందీప్ మాథూర్ ఈరోజు ప్రధాన విభాగాధిపతులు, నాలుగు డివిజన్ల రైల్వే మేనేజర్లతో కలిసి ఒక ముఖ్యమైన భద్రతా సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ప్రయాణికులకు సురక్షిత మైన మరియు ఎలాంటి అంతరాయం లేని ప్రయాణ అను భవాన్ని అందించేందుకు రైల్వే భద్రతా చర్యలను బలోపేతం చేయడం, సమర్థవంతమైన రద్దీ నియంత్రణ వ్యూహాలను అమలు చేయడం మరియు 'రైల్ మదద్' ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థను మరింత వేగవంతం చేయడంపై ఈ ఉన్నత స్థాయి సమావేశంలో ప్రధానంగా చర్చించారు. ఈ సందర్భంగా అధికారులను ఉద్దే శించి సందీప్ మాథూర్ మాట్లాడుతూ, పండుగల సమయంలో రద్దీని ఎదుర్కోవడానికి ప్రస్తుతం ఉన్న కార్యాచరణ ప్రణాళికలను సమీక్షించారు. తగినంత సిబ్బందిని అందుబాటులో ఉంచాలని మరియు ప్రయాణికులకు చురుకుగా సౌకర్యాలు కల్పించేలా చూడాలని అధికారులను ఆదేశించారు. అంతేకాకుండా, 'రైల్ మదద్' పోర్టల్ ద్వారా వచ్చే ప్రయాణికుల ఫిర్యాదులను సత్వరమే మరియు సమర్థవంతంగా పరిష్కరించాల్సిన అవ సరాన్ని జనరల్ మేనేజర్ నొక్కి చెప్పారు. విధి నిర్వహణలో అసాధారణమైన అప్రమత్తత మరియు అంకితభావాన్ని ప్రదర్శించిన నలుగురు ఫ్రంట్‌లైన్ సిబ్బందిని సెప్టెంబర్ 2026 కు గానూ "ఉత్తమ ఉద్యోగి" భద్రతా అవార్డులతో జనరల్ మేనేజర్ సత్కరించారు.


ఈ ప్రతిష్టాత్మక అవార్డు గ్రహీతలు:

టి.సురేష్ – లోకో పైలట్/గూడ్స్, విజయవాడ డివిజన్, కె.మేరీ – టెక్–I/C&W, గుంటూరు డివిజన్, ఎస్.కె ముక్తియార్ – పాయింట్స్ మాన్, గుంతకల్లు డివిజన్, టి.రామ్ ప్రసాద్ – ట్రాక్ మెయింటెనర్–×,విశాఖపట్నం డివిజన్. అవార్డు గ్రహీతలు కనబరిచిన సమయస్ఫూర్తిని, రైల్వే భద్రత పట్ల వారు చూపిన అత్యుత్తమ నిబద్ధతను జనరల్ మేనేజర్ కొనియాడారు. వారి అంకితభావం మొత్తం సిబ్బందికి స్ఫూర్తిదాయకంగా నిలు స్తుందని పేర్కొన్నారు.

సింహాచలంలో వైసీపీకి షాక్

టీడీపీలోకి ట్రస్టు బోర్డు మాజీ సభ్యురాలు





విశాఖపట్నం, అక్టోబర్ 24 (నేటి మనదేశమ్) : భీమిలి నియోజకవర్గంలో వైసీపీ నుంచి టీడీపీలోకి వలసలు కొనసాగు తున్నాయి. సింహాచలం చాకిరేవు కొండకు చెందిన సింహాచలం ట్రస్టు బోర్డు మాజీ సభ్యురాలు సిరిపురపు ఆశారాణి, ఆమె భర్త కృష్ణ నేతృత్వంలో 100 మంది వైసీపీ నాయకులు, కార్యకర్తలు ఎంవీపీ కాలనీ క్యాంప్ కార్యాలయంలో భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు సమక్షంలో గురువారం పార్టీలో చేరారు. వీరందరికీ పసుపు కండువాలు కప్పి గంటా పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అయిదేళ్ల పాటు రాష్ట్రాన్ని విధ్వంసం చేసిందని వైసీపీపై ధ్వజమెత్తారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని అభివృద్ధిలో అగ్రగామిగా నిలబెట్టిన సీఎం చంద్రబాబు నాయకత్వం పట్ల ఆకర్షితులై వైసీపీ నుంచి పెద్ద ఎత్తున వలస వస్తున్నారని చెప్పారు. గడిచిన రెండేళ్లలో భీమిలి నియోజకవర్గంలో రూ. 2,900 కోట్లతో అభివృద్ధి ప్రాజెక్టులు పట్టా జరిగిందన్నారు. భీమిలి, మధురవాడ జోన్ లలో రూ. 400 కోట్లతో మౌలిక వసతులు కల్పించామని తెలి పారు. 120 వార్డు టీడీపీ కార్పొరేటర్ అభ్యర్థి పీవీ నరసింహాన్ని గతం కంటే ఎక్కువ మెజారిటీతో గెలిపించాలన్నారు. చాకిరేవు కొండ ప్రాంతంలో మరిన్ని అభివృద్ధి పనులు చేపడతామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో భీమిలి పార్టీ ఇంచార్జ్ చిక్కాల విజయ్ బాబు, మాజీ కార్పొరేటర్ పీవీ నరసింహం తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ప్రతి అభ్యర్థి కష్టపడి పని చేసి జీవీఎంసీపై కూటమి జెండా ఎగురవేయాలి

- మంత్రి డా.డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి

-విశాఖలో జీవీఎంసీ కూటమి కార్పొరేట్ అభ్యర్థులతో సమావేశం నిర్వహించిన మంత్రి డిఎస్ బీవీ స్వామి



విశాఖపట్నం, అక్టోబర్ 24 (నేటి మనదేశమ్) : జీవీఎంసీ ఎన్నికల్లో కూటమి గెలుపు కోసం ప్రతి అభ్యర్థి కష్టపడి పని చేయాలని జిల్లా ఇంచార్జ్ మంత్రి డోలా శ్రీ బాల వీరాంజ నేయస్వామి అన్నారు. గురువారం విశాఖ డాల్ఫిన్ హోటల్ లో జీవీఎంసీ కూటమి కార్పొరేట్ అభ్యర్థులతో మంత్రి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్నికల్లో వ్యవహరించాల్సిన తీరు, ప్రజలతో మమేకమవడం వంటి అంశాలపై అభ్యర్థులకు మంత్రి పలు సలహాలు, సూచనలు చేశారు. అనంతరం మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి మాట్లాడుతూ.. టిక్కెట్లు ఆశించి పొందలేని వారిని సమన్వయంతో కలుపుకొని పనిచేయా లన్నారు. వైసీపీ అభ్యర్థుల కంటే కూటమి అభ్యర్థులు ప్రచారంలో దూసుకెళ్తూ ప్రజా సమస్యలపై దృష్టి పెట్టాలన్నారు. కూటమి రెండున్నరేళ్ల పాలనలోనే విశాఖ నగరానికి పెద్ద ఎత్తున కంపెనీలు, పరిశ్రమలు తీసుకు వచ్చి యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించామన్నారు. వైసీపీ హయాంలో విశాఖ నగరంలో జరిగిన అభివృద్ధి శూన్యమని, కూటమి పాలనలో నగరంలో వేల కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు చేశామన్నారు. ప్రజలంతా కూటమి పాలనలో ప్రజలంతా సంతోషంగా ఉన్నారన్నారు. ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ప్రతి అభ్యర్థి కష్టపడి పని చేసి జీవీఎంసీపై కూటమి జెండా ఎగురవేయాలని మంత్రి డా.డోలా బాల వీరాంజ నేయస్వామి పిలుపునిచ్చారు. ఈ సమా వేశంలో ఎంపీ శ్రీ భరత్, ఎమ్మెల్యేలు వెలగపూడి రామకృష్ణ బాబు, వంశీకృష్ణ శ్రీనివాస్, ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవి రావు, విశాఖ జిల్లా టీడీపీ అధ్యక్షులు చోడే పట్టాభిరామ్, జీవీఎంసీ ఎన్నికల పరిశీలకులు ఎంఏ షరీఫ్, కూటమి మేయర్ అభ్యర్థి ముక్కా శ్రావణి తదితరులు పాల్గొన్నారు.

అన్ని జెడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాలు కైవసం చేసుకోవాలి

ఇంచార్జ్ మంత్రితో గంటా భేటీ



విశాఖపట్నం, అక్టోబర్ 24 (నేటి మనదేశమ్) : రాబోయే జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల్లో అనుసరించాల్సిన గెలుపు వ్యూహంపై జిల్లా ఇంచార్జ్ మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయ స్వామితో భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ఎంవీపీ కాలనీ క్యాంప్ కార్యాలయంలో గురువారం భేటీ అయ్యారు. భీమిలి, ఆనందపురం, పద్మనాభం మండలాల్లోని మూడు జెడ్పీటీసీ, 44 ఎంపీటీసీ స్థానాలను ఏకపక్షంగా కైవసం చేసుకునేలా పార్టీ శ్రేణులను సన్నద్ధం చేయాలన్నారు. టీడీపీకి కంచుకోటైన భీమిలి నియోజకవర్గంలో అసెంబ్లీ ఎన్నికల్లో సాధించిన రికార్డు స్థాయి మెజారిటీలు స్థానిక ఎన్నికల్లో కొనసాగించాలని పేర్కొన్నారు. వైసీపీ హయాంలో గ్రామీణాభివృద్ధి పూర్తిగా కుంటుపడిందని.. పల్లె పండుగ పేరుతో కూటమి ప్రభుత్వం గ్రామాల్లో అభివృద్ధి వరద పారించిందన్నారు. విజయావకాశాలను దృష్టిలో ఉంచు కుని అభ్యర్థులను ఎంపిక చేయాలని, పోటీకి సిద్ధమవుతున్న నాయకుల గురించి చర్చించుకున్నారు. జీవీఎంసీ ఎన్నికల్లో గెలుపు గుర్రాలనే ఎంపిక చేశామని, అన్ని స్థానాల్లో విజయం సాధిస్తామని గంటా ధీమా వ్యక్తం చేశారు. జిల్లా పార్టీ అధ్యక్షుడు చోడే పట్టాభిరాం కూడా చర్చలో పాల్గొన్నారు.

ఏకాభిప్రాయ ప్రయత్నం : జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల్లో ఏకాభిప్రాయం సాధించడానికి ఆయా మండలాల ముఖ్యనేతలతో గంటా సమావేశమయ్యారు. స్థానిక నాయకులందరూ మాట్లాడుకుని ఆమోదయోగ్యమైన పేర్లు ఇవ్వాలని గతంలో చేసిన సూచన మేరకు ప్రతిపాదించిన పేర్ల గురించి చర్చించారు. జెడ్పీటీసీలు, ఎంపీపీలుగా పోటీ చేయాలనుకుంటున్న ఆశావహు లతో కూడా భేటీ అయ్యారు. కొలిక్కి వచ్చిన జాబితాలోని నాయకులను నామినేషన్లు దాఖలు చేయాలన్నారు. టికెట్ ఇవ్వాలని పలువురు నాయకులు కోరగా పార్టీ ఐ.వి.ఆర్.ఎస్. సహా వివిధ మార్గాల ద్వారా అభిప్రాయ సేకరణ తర్వాతే అభ్యర్థిని ఖరారు చేస్తుందని చెప్పారు. గంటాతో సమావేశమైన వారిలో భీమిలి మండలం నుంచి గాడు వెంకటప్పడు, సరగడ అప్పారావు, డి.ఎ.ఎన్. రాజు.. పద్మనాభం నుంచి కసిరెడ్డి దామోదరరావు, కోరాడ రమణ, కాళ్ల నగేష్ కుమార్, రామరాజు, కాళ్ల సత్యనారాయణ, ఆవాల గంగరాజు, కురుమిన లీలావతి.. ఆనందపురం మండలం నుంచి తాట్రాజు అప్పారావు, లొడగల వెంకట్రావు, కర్రి శ్రీనివాస్, వానపల్లి ఈశ్వరరావు, బమ్మిడి ఉమ, గండ్రెడ్డి సోమినాయుడు, బలిరెడ్డి మల్లిఖార్జునరావు, బోని ప్రసాద్, కాకర్లపూడి శ్రీకాంత్ రాజు ఉన్నారు.

ఫారం జి

బ్లాక్‌బర్న్ ఫ్యూయల్స్ ప్రైవేట్ లిమిటెడ్ కోసం ఆసక్తి వ్యక్తీకరణకు ఆహ్వానం

(భారత దివాలా మరియు బ్యాంక్రప్సీ బోర్డు (కార్పొరేట్ వ్యక్తుల కోసం దివాలా పరిష్కార (ప్రక్రియ) నిబంధనలు, 2016లోని నిబంధన 36A యొక్క ఉప-నిబంధన (1) ప్రకారం)

సంబంధిత వివరాలు		
1	కార్పొరేట్ రుణగ్రహీత పేరు, పాన్ & సిఐఎన్/ ఎల్ఎల్పి నంబర్‌తో పాటు.	బ్లాక్‌బర్న్ ఫ్యూయల్స్ ప్రైవేట్ లిమిటెడ్ PAN: AADCM5940P CIN: U68200AP1992PTC013774
2	నమోదిత కార్యాలయ చిరునామా	ఇంటి నం. 1-81, గణపతి నివాస్ (శ్రీనివాస నగర్, NCS రోడ్, విజయనగరం, ఆంధ్రప్రదేశ్, భారతదేశం - 535001
3	వెబ్‌సైట్ యొక్క URL	అందుబాటులో లేదు
4	అధికశాతం స్థిరాస్తులు ఉన్న ప్రదేశం యొక్క వివరాలు	అందుబాటులో లేదు
5	ప్రధాన ఉత్పత్తులు/సేవల స్థాపిత సామర్థ్యం	అందుబాటులో లేదు
6	గత ఆర్థిక సంవత్సరంలో విక్రయించిన ప్రధాన ఉత్పత్తులు/సేవల పరిమాణం మరియు విలువ	గత ఆర్థిక నివేదిక FY 2024-2025 ప్రకారం- శూన్యం
7	ఉద్యోగులు/ కార్మికుల సంఖ్య	అందుబాటులో లేదు
8	గత రెండు సంవత్సరాల చివరిగా అందుబాటులో ఉన్న ఆర్థిక నివేదికలు (షెడ్యూళ్లతో సహా), రుణదాతల జాబితాలతో సహా మరిన్ని వివరాలు	మరిన్ని వివరాలు bfpl.cirp26@gmail.com అనే ఈ-మెయిల్‌లోని వివరణాత్మక EOIలో అందుబాటులో ఉన్నాయి.
9	కోడ్ యొక్క సెక్షన్ 25(2)(H) కింద తీర్మాన దరఖాస్తుదారుల అర్హత ఈ URLలో అందుబాటులో ఉంది: WWW.TRUUEIPE.COM	మరిన్ని వివరాలు bfpl.cirp26@gmail.com అనే ఈ-మెయిల్‌లోని వివరణాత్మక EOIలో అందుబాటులో ఉన్నాయి.
10.	ఆసక్తి వ్యక్తీకరణ స్వీకరణకు చివరి తేదీ	అనులు - 12 సెప్టెంబర్ 2026 సవరించినది - 9 నవంబర్ 2026
11.	సంభావ్య తీర్మాన దరఖాస్తుదారుల తాత్కాలిక జాబితా జారీ తేదీ	అనులు 16 సెప్టెంబర్ 2026 సవరించినది - 13 నవంబర్ 2026
12.	తాత్కాలిక జాబితాకు అభ్యంతరాలు సమర్పించడానికి చివరి తేదీ	అనులు - 21 సెప్టెంబర్ 2026 సవరించినది - 18 నవంబర్ 2026
13.	సంభావ్య తీర్మాన దరఖాస్తుదారుల తుది జాబితా జారీ తేదీ	అనులు - 25 సెప్టెంబర్ 2026 సవరించినది - 21 నవంబర్ 2026
14.	సంభావ్య పరిష్కార దరఖాస్తుదారులకు సమాచార మెమోరాండం, మూల్యాంకన మ్యాట్రిక్స్ మరియు పరిష్కార ప్రణాళికల కోసం అభ్యర్థనను జారీ చేసిన తేదీ	అనులు - 30 సెప్టెంబర్ 2026 సవరించినది - 26 నవంబర్ 2026
15.	తీర్మాన ప్రణాళికలను సమర్పించడానికి చివరి తేదీ	అనులు - 30 అక్టోబర్ 2026 సవరించినది - 26 డిసెంబర్ 2026
16.	ఆసక్తి వ్యక్తీకరణను సమర్పించడానికి ఈ ఇమెయిల్ ఐడిని నమోదు చేయండి	bfpl.cirp26@gmail.com
17.	MSMEగా కార్పొరేట్ రుణగ్రహీత యొక్క రిజిస్ట్రేషన్ స్థితి వివరాలు)	వర్తించదు

తేదీ: 25.10.2026
స్థలం: విశాఖపట్నం

ఐపి మైలవరపు సుజాత
మెస్సర్స్. బ్లాక్‌బర్న్ ఫ్యూయల్స్ ప్రైవేట్ లిమిటెడ్ వారి రిజల్యూషన్ ప్రొఫెషనల్
రిజిస్ట్రేషన్ నెం. IBBI/IPA-003/00434/2023-2024/14286